# ఈ నెల విశేషాలు

సత్యనరసింహశర్మ

## హేమంతలక్ష్మికి స్వాగతం

**మార్గశిర బహుళ త్రయోదశి, శనివారం (01.01.2022) నుండి పుష్య బహుళ చతుర్దశి, సోమవారం(31.01.2022) వరకు**

**పు**ష్యమాసానికి లక్ష్మీనారాయణులు నియామక దేవతలు. పుష్యమి నక్షత్ర అధిష్ఠాన దేవత(గ్రహం) బృహస్పతి. పుష్యమి నక్షత్రము శనీశ్వరునికి సంబంధించినది. ఈ మాసంలో శనైశ్వరునికి ప్రీతికై ఏ కాస్త సత్కర్మ చేసినా, ఆ గ్రహగతంగా వచ్చే బాధలనుండి ఉపశమనం లభిస్తుంది. పితృయానమైన దక్షిణాయన ముగింపు, దేవయానమైన ఉత్తరాయణ ప్రారంభం అయ్యే సంధికాలం ఈ మాసంలో వచ్చే మకర సంక్రాతి పర్వదినం. కనుకనే అది పెద్ద పండుగే కాక పెద్దల పండుగ కూడా.

**దానప్రాశస్త్యం:** ఈ నెలలో వస్త్రదానము, తిలదానము చేయడం శ్రేష్ఠం.

**01.01.2022 – శనివారం – శనిత్రయోదశి, మాస శివరాత్రి**

మృగశిరా నక్షత్ర ప్రాధాన్యత కలిగిన ఈ మాసములో శనిత్రయోదశితో కూడిన మాస శివరాత్రినాడు శివాభిషేకం, శివారాధన అత్యంత శ్రేష్ఠమైనవి.

**09.01.2022 – ఆదివారం – భానుసప్తమి**

ఆదివారం, సప్తమి కలిసినది అలభ్యయోగంగా చెప్పబడింది. ఈ రోజున చేసే ఏ పుణ్యకార్యాలైనా అక్షయ ఫలితాలను కలుగజేస్తాయి.

### ప్రధానమైన పండుగలు

**జనవరి**

**01.01.2022 – శనివారం – శనిత్రయోదశి, మాస శివరాత్రి**

**పుష్య మాసం**

**03.01.2022 – సోమవారం – శుక్రమౌఢ్యారంభం**

**09.01.2022 – ఆదివారం – భానుసప్తమి**

**12.01.2022 – బుధవారం – వివేకానంద జయంతి**

**13.01.2022 – గురువారం – ముక్కోటి / పుత్రదా ఏకాదశి, భోగి పండుగ**

**14.01.2022 – శుక్రవారం – మకరసంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, శుక్రమౌఢ్యత్యాగం, కూర్మద్వాదశి**

**15.01.2022 – శనివారం – కనుమ, పక్షిపూజ, శనిత్రయోదశి**

**21.01.2022 – శుక్రవారం – సంకష్టహర చతుర్థి**

**22.01.2022 – శనివారం – త్యాగరాజ ఆరాధనోత్సవం**

**28.01.2022 – శుక్రవారం – విమల ఏకాదశి, షట్తిల ఏకాదశి**

**30.01.2022 – ఆదివారం – మాసశివరాత్రి**

**12.01.2022 – బుధవారం – వివేకానంద జయంతి**

భారతదేశ సంస్కృతీ పతాకాన్ని విశ్వమంతా ఎగురవేసి విశ్వవ్యాప్తం చేసిన వివేకానందులవారి జయంతిరోజున వారి స్మరణ చేసుకుని, ఆ స్ఫూర్తితో మన వంతుగా ఏం చెయ్యగలమో ఒకసారి ఆలోచించి, విధినిర్వహణ ప్రారంభించాల్సిన శుభతరుణం.

**13.01.2022 – గురువారం – ముక్కోటి / పుత్రదా ఏకాదశి, భోగి పండుగ**

ఈ రోజు వైకుంఠంలోని ఉత్తరద్వారం తెరువబడి నారాయణుడు దర్శనమిస్తాడని పురాణోక్తి. శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఈ రోజున వజ్రమాణిక్యాలతో అలంకరింపబడిన ఉత్సవ విగ్రహాలను ఉత్తరద్వారం నుండి వెయ్యిస్తంభాల వేదికపైకి తెచ్చి ప్రత్యేక అర్చనాదులు చేసి భక్తులకు దర్శింపజేస్తారు. ఏడాదికి ఈ ఒక్కరోజు మాత్రమే తెరిచే ఈ ఉత్తరద్వారం ద్వారా నారాయణుని దర్శించుకోవడం అనంత పుణ్యప్రదం. ఈ రోజున ఏకాదశీ వ్రతపాలన అనేక ఏకాదశులను ఆచరించిన పుణ్యాన్ని కలుగజేస్తుంది కనుక దీనికి ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు. ఈ ఏకాదశీ వ్రతాన్ని విధివిధానంగా ఆచరించడం

వల్ల సంతానం లేనివారికి సంతానప్రాప్తి, సంతానవంతులకు పిల్లల ఆయురారోగ్యాభివృద్ధి కలుగుతుంది.

భోగి సందర్భంగా ఈ రోజున ఇంద్రుని, ఇష్టదేవతలను పూజించాలి. ఈ రోజు ఇంటి ముంగిట కాని, కూడలి వద్దకానీ భోగి మంట వేస్తారు. ధనుర్మాసము నెలరోజులు పెట్టిన గొబ్బెమ్మలను పిడకలుగా చేసి, వాటిని దండగా గ్రుచ్చి, వాటిని భోగిమంటలలో పిల్లలచేత వేయించడం సంప్రదాయం. భగవత్ స్మరణ పూర్వకంగా తగినన్ని కర్రలతో, పిడకలతో చలిమంటలు వేయడం శ్రేయస్కరం. ఇది అరిష్టశక్తుల నాశనమే కాకుండా ఐశ్వర్య సిద్ధి కూడా కలిగిస్తుంది.

గోదాదేవి నెలరోజుల తపస్సు పండినరోజు కాబట్టి, ఈ రోజు **గోదాకల్యాణం** చేస్తారు.

**14.01.2022 – శుక్రవారం – మకరసంక్రాంతి, ఉత్తరాయణ ప్రారంభం, శుక్రమౌఢ్యత్యాగం, కూర్మద్వాదశి**

సంక్రమణ ప్రవేశం మధ్యాహ్నం గం.2:29 ని.లకు జరుగుతోంది. సంక్రమణ ప్రవేశం తరువాత 40 ఘడియలు (16 గంటలు) పుణ్యకాలం. రాత్రి సమయం సంక్రమణ పాలనకు నిషిద్ధం కాబట్టి సూర్యాస్తమయ సమయం వరకు పుణ్యకాలంగా



గుర్తించి సంక్రమణ పాలన చెయ్యాలి.

ఈ రోజు సూర్యుడు మకర రాశిలో ప్రవేశిస్తాడు. ఈ నాటినుండి ఉత్తరాయణం ప్రారంభమౌతుంది. ఈనాడు చేసే మంత్ర/నామ జపాదులు, ధ్యానం, పారాయణములు, దానాలు మొదలైనవి శ్రేష్ఠ ఫలితాలను కలిగిస్తాయి. పితృదేవతల తృప్తికై తర్పణాదులు చేయడం వలన వారికి ఉత్తమ గతులు కలగడమే కాక, వంశాభివృద్ధి, సుఖసంతోషాలు కలుగుతాయి.

**రవి సంక్రమణే ప్రాప్తే న స్నాయాద్యాస్తు మానవ,**
**సప్తజన్మ సురోగస్యాత్ నిర్ధనశ్చైవ జాయతే**

– సంక్రమణ కాలమునందు స్నానము తప్పనిసరిగా ఆచరించాలని శాస్త్ర వచనం.

ధాన్యం, ఫలాలు, విసనకర్ర, వస్త్రం, బంగారం, కాయగూరలు, దుంపలు, తిలలు, చెరకు, గోవు మొదలైనవి దానం చెయ్యాలి. ఈ రోజున నువ్వులనూనెతో శివుని చెంత దీపాన్ని వెలిగించడం, నువ్వులు–బియ్యం కలిపి శివుని పూజించడం శ్రేష్ఠం. ఈ రోజున నువ్వుల్ని ఏదో ఒక రూపంలో తినాలని శాస్త్రవాక్యం. ఈ రోజున ఏకభుక్తము (ఒంటిపూట భోజనం) చెయ్యాలి.

ఈ రోజున కూర్మావతారంగా నారాయణుని పూజించడం వలన జ్ఞానం కలుగుతుంది.

**15.01.2022 – శనివారం – కనుమ, పక్షిపూజ, శనిత్రయోదశి**

పాడిపంటలను, పశుసంపదలను లక్ష్మీస్వరూపంగా అర్చించడం ఈ రోజు ప్రత్యేకత. పశువులు, పంటలు మనల్ని పోషించేవి. వాటిలో దాగియున్న పోషకశక్తి భగవత్ స్వరూపంగా గోవులను, వృషభాలను ప్రత్యేకంగా పూజించాలి.

**21.01.2022 – శుక్రవారం – సంకష్టహర చతుర్థి**

ఉత్తరాయణంలో వచ్చే మొదటి సంకష్టహర చతుర్థీ వ్రతాచరణ వల్ల అన్ని విఘ్నాలు తొలగి సుఖసంతోషాలు కలుగుతాయి.

**22.01.2022 – శనివారం – త్యాగరాజ ఆరాధనోత్సవం**

నాదోపాసన చేసి తాను బ్రహ్మములో ఐక్యం కావడమే కాక సకలదేవతలపై మంత్రసదృశములైన కీర్తనలు రచించి ఎందరికో భక్తి భావనను నేటికీ కలుగజేస్తున్న మహర్షి త్యాగయ్య. ఈ రోజున ఆ మహర్షిని తగురీతిన అర్చించడం వల్ల ఋషిఋణం కొంతైనా తీర్చుకున్నవారవుతారు.

**28.01.2022 – శుక్రవారం – విమల ఏకాదశి, షట్తిల ఏకాదశి**

ఈ రోజున స్నానం చేసే నీటిలో నువ్వులు కలుపుకొని చెయ్యాలి. నువ్వులను ఆహారంలో స్వీకరించడం, మంచినీటిలో నువ్వులను కలుపుకోవడం, నువ్వులతో హోమం చెయ్యడం, నువ్వులతో దేవుని పూజించడం, నువ్వులను దానం చేయడం చెయ్యాలి.... ఈ విధంగా ఇది షట్తిల ఏకాదశి అయింది.

**30.01.2022 – ఆదివారం – మాసశివరాత్రి**

ఆదివారంతో కూడిన మాసశివరాత్రి శివారాధనకు ప్రత్యేకమైనది కనుక ఈ రోజు చేసే ప్రదోష శివారాధన శివానుగ్రహాన్ని కలిగిస్తుంది.